## పేదల ఆకలితీరితే మా కడుపు నిండుతుంది



ప్రజలతో కలిసి రూ.5ల భోజనం తింటున్న ఎమ్మెల్యే సతీమణి మర్రి జమున

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబర్ 5 : పేదల ఆకలితీరితే మా కడుపు నిండుతుందని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి సతీమణి మర్రిజమున అన్నారు. జిల్లా కేంద్రంలో ఎంజేఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.5 భోజనం క్యాంటిన్‌ను గురువారం మర్రి జమున పరిశీలించి ప్రజలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలు కడుపునిండా అన్నం తిని సంతోషంగా ఉంటేనే మా కడుపు నిండుతున్నాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

## బతుకమ్మ చీరల పంపిణీ



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

తిమ్మాజిపేట, అక్టోబర్ 5 : తెలంగాణ రాష్ర్టానికి పూర్వవైభవం తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దని సర్పంచ్ తిరుపతమ్మ అన్నారు. మండలంలోని అప్పాజిపల్లిలో గురువారం ఆమె బతుకమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఉపసర్పంచ్ బాలరాజు, నాయకులు జల్లి రమేశ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న ఎంపీపీ మధు

తెలకపల్లి, అక్టోబర్ 5 : మండల కేంద్రంలో గురువారం సీఎం కేసీఆర్ క్రీడా సామగ్రిని ఎంపీపీ మధు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరించారు. క్రీడాకారులకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో వెంకటయ్య, ఎంపీటీసీలు లక్ష్మమ్మ, రమేశ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బావిలో పడి వ్యక్తి మృతి

తిమ్మాజిపేట, అక్టోబర్ 5 : తిమ్మాజిపేట మండలం బుద్ధసముద్రంలో వ్యక్తి బావిలో పడి మృతిచెందిన ఘటన చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి ఎస్సై భాస్కర్‌రెడ్డి, గ్రామస్తుల కథనం ప్రకారం.. బుద్ధసముద్రానికి చెందిన నూకల ఆంజనేయులు(48) బుధవారం సాయంత్రం చింతకాయల కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు అంతా గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం స్థానిక నడుపులమ్మ చెరువు సమీపంలోని బావి పక్కన అతడి చెప్పులు, తువ్వాల కనిపించడంతో గ్రామస్తులు బావిలో గాలించారు. నీళ్లు ఎక్కువగా ఉండటంతో నాగర్‌కర్నూల్ నుంచి అగ్నిమాపక వాహనాన్ని రప్పించి నీళ్లు తోడేయగా, సాయంత్రానికి ఆంజనేయులు మృతదేహం కనిపించింది. ఆంజనేయులు కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

తిమ్మాజిపేట, అక్టోబర్ 5 : మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులను గురువారం ప్రారంభించారు. విస్తరణ పనుల కోసం ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మొదటి విడుతగా రూ.5 కోట్లు మంజూరు చేయడంతో పనులకు శ్రీకారం చుట్టారు. మొదటగా రెండువైపులా చదును చేయడంతో పాటు రోడ్డు వెడల్పు ప్రక్రియను చేపడుతున్నారు. ఈ సందర్భంగా విస్తరణతో పాటు రోడ్డు మధ్యలో డివైడర్, బటర్‌ఫ్లై లైట్లు ఏర్పాటు చేయనున్నారు.

## కానిస్టేబుల్‌గా ఎంపికైన రైతు బిడ్డ

తిమ్మాజిపేట, అక్టోబర్ 5 : మండలంలోని అప్పాజిపల్లికి చెందిన ఒక యువతి కానిస్టేబుల్‌గా ఎంపికైంది. బుధవారం ఫలితాల్లో గ్రామానికి చెందిన జల్లి ప్రమీల అనే యువతి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. గ్రామానికి చెందిన జల్లి శివమ్మ-లక్ష్మయ్య కూతురు ప్రమీల పాఠశాలస్థాయి వరకు మండల కేంద్రంలో చదివిన ఆమె ఇంటర్ జడ్చర్ల, డిగ్రీ హైదరాబాద్‌లో చదివింది.

# బీఆర్‌ఎస్ హయాంలోనే పంచాయతీలుగా తండాలు

- కర్నెతండా లిఫ్ట్ ద్వారా సాగునీరు
- అభివృద్ధికి నిదర్శనం తండాలు
- ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

బిజినేపల్లి, అక్టోబర్ 5 : గత పాలకుల నిర్లక్ష్యం వల్ల వారి 60 ఏండ్ల పాలనలో తండాలు అభివృద్ధికి నోచుకోలేదని, బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఊడ్గులకుంటతండా, నక్కలచెరువు తండా, చిన్నపీర్‌తండా, మిట్యాతండా, ఎర్రకుంట తండా, లట్టుపల్లి, గంగారంలో పదేండ్ల ప్రస్థానంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిట్యాతండా, భీమునితండాలకు పంటలకు సాగునీటిని కర్నెతండా లిఫ్ట్ ద్వారా అందిస్తున్నామన్నారు. తండాలు ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పడడంతో కోట్లాది రూపాయల నిధులు మంజూరై ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. రూ.2 కోట్లతో ఊడ్గులకుంటతండాకు బీటీరోడ్డు వేయడం జరిగిందన్నారు. ఈ తండాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు వేశాన్నారు. తండా సమీపంలోని పెద్దచెరువును కేఎల్‌ఐ యూటీ ద్వారా నీటిని నింపుతామన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్ళీ బీర్‌ఎస్సే ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఇక్కడ మర్రి జనార్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమన్నారు. గ్రామాలకు కొందరు వచ్చి కల్లబొల్లిమాటలు చెబుతారని, వారి మాటలు నమ్మవొద్దని గుర్తు చేశారు. చాలా మంది డబ్బులకోసం రాజకీయం చేస్తారని, కానీ తాను ప్రజాసేవకోసం రాజకీయాల్లోకి వచ్చాన్నారు. అందులో భాగంగానే పేదింటి ఆడబిడ్డలకు పెండ్లిల్లు, రూ.5భోజనం, పాఠశాలల నిర్మాణం తమ ట్రస్టు ద్వారా చేస్తున్నామన్నారు. 60 ఏండ్లలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధికంటే కేవలం పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎక్కువ మొత్తం అభివృద్ధి చేసిందన్నారు. అదేవిధంగా సంత్ సేవాలాల్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. అదేవిధంగా గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందని, త్వరలోనే తండాలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో గిరిజన గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వీటితోపాటు మినీ ఫంక్షన్‌హాల్ నిర్మిస్తామన్నారు. గతంలో ఎవరైనా రైతులు చనిపోతే ఆపద్బంధు పథకం కింద కేవలం రూ.50 వేలు ఇచ్చేవారని, కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు చనిపోయిన వారంరోజుల్లోపే రూ.5లక్షలు రైతుబీమా కింద వారి కుటుంబానికి అందిస్తున్నాన్నారు. రైతుబీమా, షాదీముబారక్, వృద్ధాప్య ఫించన్లు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ పులెందర్‌రెడ్డి, ఉన్నారు.



ఊడ్గులకుంట తండాలో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

### మత్స్యకారుల అభివృద్ధికి కృషి

బిజినేపల్లి, అక్టోబర్ 5 : మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మంగనూర్‌లో చెరువులో తెలంగాణ మత్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తున్న చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నదన్నారు. ఉచితంగా చేపపిల్లలను అందిస్తున్న ఏకైక తెలంగాణ ప్రభుత్వం అన్నారు. ముదిరాజ్ సోదరుల కోసం సబ్సిడీ కింద చేపలు మార్కెట్‌కు తరలించడానికి వాహనాలు అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, కుర్మయ్య, నాగిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, తిరుపతయ్య, సాగర్, సత్యం, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబర్ 5 : విద్యార్థులు కష్టపడి చదువుకొని మంచి ఫలితాలను సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో సంజయ్‌నగర్ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ జయంత్‌కుమార్‌రెడ్డి, డీఈవో గోవిందరాజులతో కలిసి 150 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువును కష్టంతో కాకుండా ఇష్టంగా చదవాలన్నారు. విద్యార్థులకు వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయమ్మతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.



ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న పురచైర్మన్, కమిషనర్, డీఈవో

## సీసీరోడ్డు పనులు ప్రారంభం

బిజినపల్లి, అక్టోబర్ 5 : మండలంలోని పాలెంలో సీసీరోడ్డు పనులను ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ లావణ్య గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సహకారంతో ఎఫ్డీఎఫ్ నిధుల నుంచి 7వ వార్డులో రూ.5 లక్షలతో సీసీ రోడ్డును మంజూరు చేశారన్నారు. అనంతరం బతుకమ్మ చీరలు మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాదవరెడ్డి, ఖదీర్, సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్నారు.

## ఇంధనం ఆదాపై చిత్రలేఖన పోటీలు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 5 : ఇంధన పొదుపుపై ప్రతివిద్యార్థికి అవగాహన తప్పనిసరిగా ఉండాలనే ఉద్దేశంతోనే భారత విద్యుత్ శాఖ, జాతీయ థర్మల్ విద్యుత్ పవర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించనున్నట్లు డీఈవో గోవిందరాజులు గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు, 5వతరగతి నుంచి 10వతరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయ స్థాయిలో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్రస్థాయికి ఎన్‌టీపీసీ లిమిటెడ్ దక్షిణ ప్రాంతం నోడెల్ అధికారి కవాడీగూడ సికింద్రాబాద్ అడ్రస్‌కు అక్టోబర్ 25వ తేదీలోగా పంపించాలని తెలిపారు. మరింత సమగ్ర సమాచారానికి జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి(9989921105)ని సంప్రదించాలన్నారు.

## రేషన్‌డీలర్ల కార్యవర్గం ఏర్పాటు

తిమ్మాజిపేట, అక్టోబర్ 5 : రేషన్ డీలర్లు గురువారం నూతన మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. గురువారం మండల కేంద్రంలో సంఘం కార్యాలయంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా జుంపాల్, ఉపాధ్యక్షుడిగా కృష్ణారెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.

## జర్నలిజంతోనే మెరుగైన సమాజం

- ఎంపీపీ మధు

తెలకపల్లి, అక్టోబర్ 5 : జర్నలిజంతోనే మెరుగైన సమాజం ఏర్పడుతుందని ఎంపీపీ మధు అన్నారు. మండల కేంద్రంలోని గోవర్ధనరెడ్డి డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన జర్నలిజంలో మౌలిక అంశాలు అనే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాటి ప్రాచీన కాలం నుంచి నేటి ఆధునిక కాలం వరకు సమాజంలో చైతన్యం కల్గించడానికి జర్నలిజం వారధిగా నిలిచిందన్నారు.డిగ్రీ విద్యార్థులకు జర్నలిజాన్ని ఒక పాఠ్యాంశంగా పెట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలోనూ తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో జర్నలిస్టులది కీలకపాత్ర అని అభిప్రాయపడ్డారు. ఇటువంటి కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు అవగాహన కల్పించినందుకు కళాశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, సీఎల్‌ఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజ మహేందర్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ యాదయ్య, ఎంపీటీసీలు లక్ష్మమ్మ, రమేశ్, విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ సందీప్‌కుమార్, ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మధు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.

NT-310380-AII

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794